

కథా కౌముది

# గెలిచిన ఓటమి

సి.యమున



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
బహుమతి పొందిన కథ

షాపింగ్ ముగించుకుని , ఇంటి వైపు బయలుదేరాను. మలుపు తిరుగుతుండగా, 'చిత్ర కళా పోటీలు ' అని ఆ హాల్ ముందున్న బోర్డ్ పై దృష్టి పడింది. అది చదవగానే అసలు 'చిత్ర కళ ' అంటే ఏమాత్రం తెలియని వసంత, చిత్రంగా దానిచే ఆకర్షింపబడి ఇంటి నుండి మాయమైన సంఘటన కళ్ళల్లో మెదిలింది. మనసు బాధగా మూలిగింది.

అనుకోకుండా నా అడుగులు అటువైపు దారితీసాయి.

అక్కడ రక రకాల పెయింటింగ్స్, వాటికి తగ్గ శీర్షికలతో ప్రదర్శింపబడి ఉన్నాయి. కొన్ని అర్థమవుతున్నాయి. మరికొన్ని ఊహకు అందనట్లు ఉన్నాయి. అవి చూస్తుంటే, మాయమైన నా ప్రాణ స్నేహితురాలు వసంత మరల మదిలో ప్రత్యక్షమయ్యింది. ఆనాటి ఒక్కొక్క ఘటన దృశ్యమానంగా గోచరమవుతోంది.

★★★★★

నేను, వసంత స్కూల్ రోజుల నుండీ ఫ్రెండ్స్. డిగ్రీ దాకా కలిసే చదివాము. నాకు పెళ్లి అయిపోయింది. తను పి.జి. కూడా చేసి, కాలేజీ లెక్చరర్ గా జాయిన్ అయ్యింది. ఉన్న ఊరిలోనే మావారి ఉద్యోగం అవ్వటంతో మా స్నేహానికి భంగం వాటిల్లలేదు.

నాకూ , వసంతకూ చిత్ర కళ గురించి పెద్దగా తెలిసిందీ, ప్రత్యేక ఆసక్తీ ఏమీ లేవు. ఓ రోజు వసంత, ప్రముఖ చిత్ర కారుడు 'మహదేవ్ ' తన కాలేజీ యాన్యువల్ డే ఫంక్షన్ కు ముఖ్య అతిధిగా వస్తున్నట్లు, వీలైతే రమ్మని ఫోన్ చేసి చెప్పింది. చిన్నపుడు తను కాస్త నేర్చుకుని ఉండటంతో, మావారు వెళ్ళటానికి ఆసక్తి చూపారు.

పాపతో సహా ముగ్గురం వెళ్లాము. మమ్మల్ని ఆప్యాయంగా రిసీవ్ చేసుకుంది వసంత.

నా రెండేళ్ల కూతురిని ఎంతో ఆప్యాయంగా పలకరించి , ఎత్తుకుని ముద్దు పెట్టుకుంది.

“పరాయి బిడ్డ మీద ఇంత ప్రేమ చూపుతున్నావు. నువ్వూ పెళ్లి చేసుకుంటే, నీకే స్వంతమైన బిడ్డ ఉంటుంది కదా “ అన్నాను మొట్ట మొదటిసారి తన పెళ్లి విషయంలో చనువు తీసుకుంటూ.

“నా రూపానికి కొన్ని, జీతానికి మరిన్ని మార్కులు వేసి పెళ్లి చేసుకోవటం అనే ప్రక్రియ ఎందుకో నాకు నచ్చటం లేదు” అంది భుజాలు ఎగరేసి నవ్వుతూ.

“పోనీ, నువ్వు ఎలా చేసుకోవాలనుకుంటున్నావో చెప్పు “ అన్నాను నవ్వుతూ.

“అబ్బా, చూద్దాంలే. మీరు కూర్చుని ప్రోగ్రాం చూడండి. నేను స్టేజ్ దగ్గరికి వెడతాను హెల్ప్ చేయటానికి “ అని మమ్మల్ని ముందు సీట్లల్లో కూర్చోపెట్టి తను వెళ్లింది.

అనుకున్న టైమ్ కు ఐదు నిమిషాలు ముందుగా చిత్రకారుడు ‘మహదేవ్’ వచ్చాడు. చాలా ప్రశాంత వదనం, చెరగని చిరునవ్వుతో అందరినీ ఇట్టే ఆకట్టుకునే రూపం ఆయనది. వయసు నలభై ...యాభై మధ్య ఉంటుందేమో.

మహదేవ్ మాట్లాడుతూ “నాకు అస్సలు చదువు మీద ధ్యాస ఉండేది కాదు. నా ప్రపంచం చిత్రలేఖనం. కన్ను తెరిచినా మూసినా బొమ్మలే...రంగులే. అమ్మ ‘అ, ఆ’ లు రాయమంటే నేను అమ్మ బొమ్మ వేసేవాడిని. టెన్త్ క్లాస్ , మీ ప్రిన్సిపాల్ ‘చేయూత’ తో పాస్ అయ్యాను “ అన్నాడు చేయూత ని నొక్కి పలుకుతూ.

అందరూ గల గలా నవ్వారు.

“వీడు నా ఫ్రెండ్ అవ్వటంతో, మీతో ఇలా గడిపే అదృష్టం దొరికింది “ అని తన ఉపన్యాసం ముగించాడు.

“ఈ చిన్న నాటి స్నేహానికి విలువ ఇచ్చి, నువ్వు రావటం మా అదృష్టంరా. నీకు ‘కాపీల ‘ చేయూత ఇచ్చిన నేను

ఇలా, పుచ్చుకున్న నువ్వు అలా అయ్యాము. నీ గురించి ప్రపంచమంతా తెలుసు. నా గురించి కనీసం ఈ కాలేజీ వాళ్లకన్నా తెలుసో లేదో “ అన్నాడు ప్రిన్సిపాల్ జాలిగా మొహం పెట్టి.

“ఊ” అని నోటి చుట్టూ చేతులు పెట్టి అల్లరిగా అరిచారు స్టూడెంట్స్ అందరూ.

తరువాత వసంత ట్రే లో పెట్టిన షీల్డ్స్ ను, ట్రోఫీలను విద్యార్థులకు పిల్లలకి ఇవ్వటానికి జాగ్రత్తగా ఆయనకు అందిస్తోంది. మహదేవ్ వాటిని పిల్లలికి అందచేసి , ఆత్మీయంగా వారిని గ్రీట్ చేస్తున్నాడు. అందరూ ఉత్సాహంగా ఫోటోలు తీయించుకుంటున్నారు.

‘ ఇహ ఫన్షన్ ముగిసింది’ అనుకునే క్షణం లో మహదేవ్ మైకు తీసుకుని “ ‘తల్లీ , బిడ్డ అనుబంధం’ తెలియచేస్తూ ఓ చిత్రాన్ని రూపొందించటంలో గత నెలగా తల మునకలయ్యి ఉన్నాను. చిత్రం లో సరైన భావ వ్యక్తీకరణ రావటం లేదు. ఎంతో సతమవుతున్నాను. నాకు ఇప్పటి దాకా ట్రోఫీలు అందిస్తూ సహాయ పడ్డ ఆ మేడమ్ సహకరిస్తే,

నేను దిగ్విజయంగా నా ప్రాజెక్టు ని పూర్తి చెయ్యగలననుకుంటున్నాను" అని వసంతని చూపిస్తూ, సూటిగా ప్రకటించటం మాతో సహా అందరినీ విభ్రాంతికి గురి చేసింది.

వసంత మొహంలో ఫీలింగ్స్ , దూరంగా కూర్చున్న నాకు అర్థం కావటం లేదు.

"సారీ మేడమ్..మీ పేరు తెలియదు నాకు" అన్నాడు వసంత కేసి చూస్తూ తనకు దగ్గరగా తన చేతిలోని మైకును పెట్టి.

"వసంత " అంది మెల్లగా వసంత.

"ఓ ..గ్రేట్ నేమ్. మీరు ఆలోచించుకుని చెప్పండి. ఇదిగో, నా విజిటింగ్ కార్డ్. మీ నిర్ణయాన్ని పట్టి ఉంటుంది ఈ ఊరి నుండి నా తిరుగు ప్రయాణం" అని ఆయన విజిటింగ్ కార్డ్ వసంత చేతిలో పెట్టి సెలవు తీసుకున్నాడు.

నా దగ్గరకు వచ్చిన వసంతతో "ఏంటి వసంత, ఆయన అడిగిన దాన్ని గురించి ఏమనుకుంటున్నావు" అన్నాను ఆపుకోలేనట్లు.

"అడిగిన విషయం పూర్తిగా అర్థం కూడా కాలేదు. ఇంకా నిర్ణయం ఏమి చెపుతాను " అంది ఆలోచనగా.

నాకు కాస్త ఆశ్చర్యంగా అనిపించింది. "ఎంత ప్రముఖ చిత్రకారుడైనా అలా ముక్కూ మొహం తెలియని వ్యక్తి ప్రాజెక్టు కోసం అడిగితే 'నో ' అని చెప్పక, 'ఆలోచిస్తానంటోంది' ఏంటీ" అని నా మనసులో ఓ గుంజాటన .

★★★★★

నాలుగు రోజుల తరువాత 'నీకో గుడ్ న్యూస్ ' చెప్పాలంటూ ఫోన్ చేసింది వసంత.

"ఏంటి, పెళ్లి సంబంధం ఏదన్నా ఒప్పుకున్నావా " అన్నాను ఆతృతగా.

"ఊహూ, కాదు "

"మరి"

"మహదేవ్ ప్రాజెక్టు కి ఒప్పుకున్నాను "

"వాట్ "

"ఏమిటే ఆ ఎక్స్ప్రెషన్ ? అంత గొప్ప చిత్రకారుడు స్వయంగా అడగటం అదృష్టం కాదా " అంది.

"రూపం గురించి మాట్లాడితే చిరాకు పడే నువ్వేనా ఈ మాట అంటోంది "

"ఇన్నాళ్ళు జనాలు నా ఒంపు సొంపులు చూశారు. కానీ ఆయన నా మేనిలో ఒంపులు, పెదవిలో సొంపులు..కళ్ళల్లో మెరుపులు కాదు చూసింది. నేను ఆ షీల్డ్స్ అందించేటప్పుడు చూపిన శ్రద్ధ , అవి అందుకుంటున్న పిల్లలని ఆప్యాయంగా నేను చూసిన చూపు ఆయనను ఆకట్టుకున్నాయట. ప్రేమతో నిండిన మనసట నాది"

తను చెపుతున్నది, నేను వింటున్నది ఏదో నాకు సంబంధించనిది , అర్థం కానిదిగా అనిపించింది.

" 'పెళ్లి కావలసిన దానివి. ఈ పనులు ఏమిటీ ' అని ఇంట్లో వాళ్ళు అడ్డు చెప్పారని, అయినా వాళ్ళ మాట పట్టించుకోకుండా తను ఆ ప్రాజెక్టు కోసం సెలవు కూడా పెట్టానని" చెప్పింది. అది విన్న నా మనసులో ఏదో తెలియని ఆందోళన.

★★★★★

మహదేవ్ తన చిత్రంలో వసంత ను అద్భుతంగా ఆవిష్కరించాడు. 'ఓ పసిబిడ్డ ను పొదివి పట్టుకున్నట్లు' గీసిన ఆ చిత్రం లో వసంత మొహం లో ఉట్టి పడుతున్న మాతృ ప్రేమ మాటల్లో చెప్పలేనిది. అమ్మని అయిన నేను కూడా, అసలు  పెళ్లే చేసుకోని వసంత వ్యక్త పరచిన అంత లోతైన భావనను వ్యక్త పరచలేనేమో !!ఒక్క ముక్క లో చెప్పాలంటే 'అద్భుతం' అనొచ్చు. కాలేజీలో అందరూ అదే మాట అన్నారు.

ఆ చిత్రం ఓ అనాధ ఆశ్రమం కోసం వేసింది. మా కాలేజీలో ప్రదర్శించిన తరువాత, ఆ చిత్రాన్ని మరో ఊరిలో ఉన్న ఆశ్రమానికి, 'ఇచ్చిన మాట ప్రకారం' ఇచ్చివేశాడు మహదేవ్.

"ఈ ప్రాజెక్టు కు అంగీకరించటం చాలా మంచి పని చేశావు వసంతా. నీలోని ఓ కొత్త కోణం మాకు పరిచయం అయ్యింది " అన్నాను వసంతను ఆప్యాయంగా హత్తుకుని మనఃస్ఫూర్తిగా.

★★★★★

ఓ రోజు ఉన్నట్లుండి మా ఇంటి కొచ్చింది వసంత. మామూలు ముచ్చట్లు అయిన తరువాత

"ఆయనను పెళ్లి చేసుకోవాలను కుంటున్నాను " అంది.

"ఏమిటీ నువ్వు మాట్లాడేది " అన్నాను షాక్ గా.

"నేను వెతుకుతున్న వ్యక్తి ఇన్నాళ్లకు ఎదురుపడ్డాడు. అందుకే పెళ్లి చేసుకుంటున్నాను "

"ఆయన నీకన్నా చాలా పెద్ద వ్యక్తి "

"అవును, ఆయన ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన మనిషి "

"నేను చెప్పేది ఆయన వయసు గురించి "

"మనసులతో ముడి పడేది మా పెళ్లి"

"నీకేమన్నా పిచ్చి పట్టిందా? సినిమా డైలాగులు ఆపు" అన్నాను చికాకుగా.

అర్ధగంట చర్చ జరిగినా అది అర అడుగు కూడ వెనకడుగు వేయలేదు.

"ఆ మహానుభావుడు అంత వయసు వచ్చినా పెళ్లి చేసు కోలేదంటే, ఏమిటి అర్ధం? బాధ్యతలంటే భయపడేమో, ఆలోచించు " అన్నాను ఏదో విధంగా దానిని ఆపాలనే ఆలోచనతో నా చివరి అస్త్రం ఉపయోగిస్తూ.

అదొక వేదాంతి లాగా నవ్వింది.

“అది ఆయనే చెప్పారు. తనకు ఎటువంటి కమిట్ మెంట్ వద్దనే పెళ్లి చేసుకోలేదని ..ఇప్పుడు కూడా ఇష్టం లేదని “

“మరి” అర్థం కానట్లు అడిగాను.

“ ‘నా వల్ల ఎటువంటి ఇబ్బంది రాదని’ ప్రామిస్ చేసి , నేనే బలవంతంగా ఒప్పించాను “

“అంత అవసరం ఏమొచ్చిందే నీకు. మంచి ఉద్యోగం, చక్కటి రూపం ...సంస్కారం. నీకు పెళ్లి కొడుకులు కరువయ్యారా ?” ఆవేశంగా నిలదీశాను.

“దొరకొచ్చేమో ..కానీ మహదేవ్ లాంటి వాడు దొరకడు”

“ఏమి వాగుతున్నావే...ఏమి చూసి పడిపోయావే “

“మొదలు ‘ గొప్ప చిత్ర కారుడు నన్ను సహాయం అడిగాడు ‘ అని మురిసిపోయాను. జస్ట్ సహకారం అనుకున్నాను. తరువాత అతనిలోని సృజనాత్మకతకు దాసిని అయిపోయాను. నన్ను సృష్టించిన బ్రహ్మకు, నాకూ కూడా తెలియని నా శరీరంలోని కోణాలు నాకే పరిచయం చేయటం అద్భుతం అనిపించింది. చిత్రం వేసే సమయంలో, అవసరమై నన్ను ముట్టినపుడు కూడా కేవలం కళ మీద దృష్టి తప్ప నన్ను వేరే దృష్టితో ఆయన చూడక పోవటం నన్ను ఆకర్షించింది. ...అలాంటి వ్యక్తి తో పెళ్లి అదృష్టం అనిపించింది “

ఏదో లోకంలో ఉన్నట్లు మాట్లాడుతున్న వసంత ఒక్క క్షణం ఆగింది ఊపిరి తీసుకుంటున్నట్లు.

“నేనొకటి చెప్పనా “ అంది అంతలోనే.

“ఊ “ అన్నాను.

“అటువంటి వారి దగ్గర సేవకురాలిగా ఉన్నా చాలనిపిస్తోంది “ అంది ఓ నిర్ణయానికి వచ్చినట్లు.

నాకు ఏమి మాట్లాడాలో అర్థం కాలేదు...నేను చెప్పినా అది వినే పరిస్థితిలో లేదని మటుకు నాకు అర్థమయ్యింది.

ఎవరు ఎంత చెప్పినా అది వినలేదు. తన ఇంట్లో వాళ్ళు ఒప్పుకోలేదు...అది దిగి రాలేదు. చివరకు మహదేవ్ తో వెళ్ళి పోయింది...నాకు కూడా చెప్పకుండా.

అందం, చదువు, ఆర్థిక స్వేచ్ఛ అన్నీ ఉన్నా, తను తీసుకున్న తప్పుడు నిర్ణయంతో జీవితంలో ఓడిపోయింది అనిపించింది మాకు.

★★★★★

“కుమారి భావిక గారి చిత్రం మొదటి బహుమతి గెలుచుకుంది “ అని మైకులో ప్రకటన, వెనువెంటనే మిన్ను ముట్టిన కరతాళ ధ్వనులు నా స్మృతులను భగ్నం చేశాయి.

'భావిక 'అనే ఆ విజేత, తాను అందుకున్న ట్రోఫీని ఎత్తి పట్టుకుని "దీనిని మా అమ్మకు డెడికేట్ చేస్తున్నాను ....మామ్ కమాన్ " అంది ఆడియెన్స్ వైపు చూస్తూ.

నాతో సహా అందరి కళ్ళు జనంలో నుండి లేచి వస్తున్న ఆమె మీదకు తిరిగాయి. తను వసంత. నేను షాక్ అయ్యాను. నిండుగా మనిషి, అంతకన్నా నిండుగా నవ్వు. తన ప్రతి కదలికను నేను అలా కళ్లప్పగించి చూస్తూ ఉండిపోయాను.

వాళ్ళు స్టేజ్ మీద నుండి దిగుతుండగా వేగంగా వాళ్ళ దగ్గరకు నడిచాను.

" 'వసంతా' అన్నాను. ఉద్వేగంతో అంతకు మించి మాట రాలేదు.

ఒక్క క్షణం నా వంక తేరిపార చూసింది. మరుక్షణం తన ఆత్మీయ కౌగిలిలో బంధించింది. మేము విడివడి , ఇహ లోకంలోకి అడుగు పెట్టాము. భావికకు పరిచయం చేసింది.

ఏ మాత్రం గర్వం లేకుండా, ' మా అమ్మ బెస్ట్ ఫ్రెండ్ ని కలిసినందుకు నేను చాలా హ్యాపీ ' అంటూ నవ్వుతూ ఆత్మీయంగా మాట్లాడుతున్న భావికని చూస్తే ముచ్చటేసింది.

"మా ఇంటికి వచ్చేస్తున్నారు, అంతే" అన్నాను.

" 'నువ్వు ఆ మాట ఎప్పుడు అంటావా' అని చూస్తున్నాను " అంది వసంత నవ్వేస్తూ. వాళ్ళు హోటల్ కి వెళ్లకుండా మాతో పాటు మా ఇంటికి వచ్చేశారు. కాన్ఫరెన్స్ కి వెళ్ళిన శ్రీవారికి ఫోన్ చేసి రెండు ముక్కల్లో వసంత విషయం చెప్పాను.

ముందు ఆశ్చర్య పోయి, తరువాత "ఇన్నాళ్లకు కలిసిన నీ ప్రియ నేస్తంతో హాయిగా ఎంజాయ్ చెయ్యి. నేను కూడా అడిగానని చెప్పు. నా తరపున భావికకి శుభాకాంక్షలు తెలియ చెయ్యి" అంటూ ఆనందంగా చెప్పారు.

ఇంట్లో ఉన్న నా కూతురు ప్రియ , భావిక ఇట్టే ఫ్రెండ్స్ అయిపోయారు. మేము ఆగకుండా మాట్లాడుతూనే ఉన్నాము. మధ్య మధ్యలో పిల్లలు మా బాల్యపు ముచ్చట్లు, కాలేజీ కబుర్లు వింటూ

"మీరు కూడా అల్లరి పనులు చేశారా ? కాలేజీలు ఎగ్గొట్టి సినిమాలకి వెళ్ళారా ....?" అంటూ ప్రశ్నలు సంధించారు.

"లేదురా , మేము పుడుతూనే మీకు అమ్మలం అయిపోయాము " అన్నాను చిరు కోపంగా.

నా మాటకు వాళ్ళు ఫక్కున నవ్వారు. డిన్నర్ పూర్తి చేసి మా మా గదుల్లో చేరాము.

★★★★★

"ఏమే, ఏమయ్యావు ఇన్నాళ్ళు " అన్నాను.

"ఏమయ్యాను, కొత్త జీవితం ప్రారంభించాను. భావికకి తల్లినయ్యాను " అంది నవ్వుతూ.

"అది అర్థమవుతూనే ఉంది. ఆయన ఎలా ఉన్నారు? మీతో రాలేదే " అన్నాను.

"తను బానే ఉన్నారు. ఆయన మా నుండి దూరంగా ఉండటం ఆరంభమయ్యి చాలా ఏళ్ళు అయ్యింది. అందుకే మాతో రాలేక పోయారు "

"ఏమిటే, ఏమి మాట్లాడుతున్నావు. ఆనాడే చెప్పాను 'బాధ్యత లేని మనిషిలాగా ఉన్నాడు, ఆయనను పెళ్లి చేసుకోకు అని " అన్నాను ఆక్రోశంగా.

అది నా వంక చూస్తూ మనోహరంగా నవ్వింది. నేను అయ్యోమయంగా చూశాను.

"తొందర పడకు, అసలు విషయం తెలియకుండా " అంది.

అర్థంకానట్లు చూశాను.

"ఆయన వెళ్ళి పోలేదు. నేనే పంపించి వేశాను " అంది దీర్ఘంగా నిట్టూరుస్తూ.

"వాట్ " షాక్ తో చిన్నగా అరిచాను .

"జరిగిందే చెపుతున్నాను"

"అదేంటే , పెళ్లి చేసుకోలేదా ?"

"నా పెళ్లిని ఇంట్లో వాళ్ళ తో సహా ఎవరూ ఆమోదించలేదని నీకు తెలుసుగా"

"నేనూ వద్దనే చెప్పానుగా " అన్నాను మెల్లగా.

"ఆయన కూడా ' ఏమి చెయ్యాలో నువ్వే చెప్పు ' అని ఓ పసి పిల్లాడిలాగా అడిగారు. ఎందుకో, నాలో ఓ తెగింపు వచ్చింది. 'నేను నా ఉద్యోగం, కుటుంబం అన్నీ వదిలేసి వస్తాను. మీకు ఇష్టమేనా ' అని అడిగాను.

'నువ్వు ఏదంటే అదే ' అని అమ్మ సమ్మతి కోరుతున్న తనయుడిలాగా జవాబు చెప్పారు. అంతే ఆ క్షణమే కట్టుబట్టలతో ఆయనతో వెళ్ళి పోయాను " జరిగినది చెపుతున్న తనలో బాధ అనేది లేదు. అది గమనించిన నాకు విస్మయం.

"ఆయన ఊరు చేరి, ముందుగా గుడిలో, తరువాత రిజిస్టార్ ఆఫీసులో రహస్యంగా పెళ్లి చేసుకున్నాము. మేముండే ఇల్లు , తన మనసే కాదు మా మధ్య మాటలు కూడా ప్రపంచంలోని రక రకాల పెయింటింగ్స్ గురించే నిండిపోయాయి. మా జీవితం ఆనందంగా గడుస్తోంది. తన వెంట దేశమంతా తిరిగాను. మన దేశంలో అన్ని సుందర ప్రదేశాలు ఉంటాయని అప్పటి దాకా నాకు తెలియదు. తను ఎన్నో అద్భుత చిత్రాలకు ప్రాణం పోసాడు. అది తుది దాకా అలాగే..."

ఏదో గొంతుకు అడ్డుపడ్డట్లు ఆగిపోయింది. 'ఇప్పుడన్నా గుండె చెమరుస్తోందా ' తన మోహం లోకి పరీక్షగా చూశాను. దాని కళ్ళల్లో కాంతి, మధుర జ్ఞాపకాలలో మునిగితేలుతున్నట్లు.

"నేను కన్సీవ్ అయ్యాను. ఇంకా భూమి మీదకి రాని, రూపమే తెలియని బిడ్డకు తన కుంచతో ఎన్ని ఆకృతులు రూపొందించారో తెలుసా. పాప పుట్టిన తరువాత ఇహ చెప్పనే అక్కరలేదు. పాప ప్రతి కదలిక తన ఫ్రేమ్ లో బిగించటమే"

" పాప అన్న ప్రాశన రోజున పుస్తకం , పెన్ ...బంగారం అలా అన్నిటితో పెయింటింగ్ బ్రష్ కూడా పెట్టాము. పాప మొట్ట మొదట ఏమి తాకిందో తెలుసా...' పెయింటింగ్ బ్రష్ '. అది చూసి ఆయన చిన్న పిల్లాడిలాగా గెంతులు వేశారు"

ఏదో ట్రాన్స్ లో ఉన్నట్లు చెప్పుకు పోతోంది వసంత.

"పాప కు రెండేళ్ళు నిండాయి. ఉన్నట్లుండి ఆయనలో స్థబ్ధత చోటు చేసుకుంది. నాకు అర్ధం కాలేదు. తరచి తరచి అడిగాను.

'నేను నా కిష్టమైన చిత్ర లేఖనానికి దూరమవుతున్నానా' అనిపిస్తోంది. నువ్వు, పాప అంటే ఇష్టమే. కానీ

' నా పేషన్ మర్చిపోతున్నానా ...ఏకాగ్రత దెబ్బ తింటోందా' అలా ఏవో ఆలోచనలు. నాకు అయోమయంగా ఉంది" అన్నారు బిక్క మొహం పెట్టుకుని.

ఆనాడు మా పెళ్లి గురించే కాదు, నేడూ తన కన్ఫ్యూజన్ నా ముందు పెట్టి త్రోవ చూపమంటున్నారు. నా బాధ్యత నాకు తెలిసింది.

"మీరు పూర్తిగా మీ కళ మీద దృష్టి పెట్టండి. అది మీ ప్రాణం. ఆ తరువాతే ఏదైనా మీకు. మిగిలిన బంధాలు దానిని అడ్డుకోరాదు. అడ్డుకుంటే ఎక్కువ రోజులు మీరు భరించలేరు. మీరు ఇంకా సాధించాల్సిన ఎన్నో లక్ష్యాలపై గురి పెట్టండి" అన్నాను.

"అదేమిటీ, ఆయన దూరంగా వెళ్ళి పోవటానికి నువ్వే ప్రోత్సహించావా ?" ఆశ్చర్యంగా అడిగాను.

" 'సంసారం, పిల్ల బాధ్యత పేర ఆయనను బంధించానా ' అని నాలో మధనం. ఆయన భావాలాకి అడ్డుకట్ట వేస్తే, ఆయన కుంచె రంగులు చిందించటం ఆపేసి, గుండె రుధిరం ద్రవించటం మొదలు పెడుతుందనిపించింది. ఈ కమిట్మెంట్స్ నుండి ఆయనకు స్వేచ్ఛ నివ్వాలనిపించింది. ఆ స్వేచ్ఛ నివ్వటమే 'మా నిజమైన ప్రేమ' కు గుర్తుగా భావించాను. అందుకే తన మార్గంలో ముందుకు వెళ్ళటానికి అంగీకరించాను. తన కళకు మరింత మెరుగులు దిద్దుకుంటూ అనేక దేశాలు తిరుగుతూ, ప్రదర్శనలు ఇస్తూ ప్రస్తుతం పారిస్ లో ఉన్నారు"

తను చెప్పిందానికి నాకు ఎలా రియాక్ట్ అవ్వాలో ఏమడగాలో తెలియక

"అంటే, టచ్ లోనే ఉన్నారా? ఈ మధ్య కలిశారా " అన్నాను.

"ఊ ..టచ్ లోనే ఉన్నాము. కానీ మేము కలిసి ఐదారేళ్లు అయిపోయింది"

"ఎలా నెట్టుకొచ్చావు పిల్లతో ఒంటరిగా " అన్నాను విచారంగా.

"అలా ఎప్పుడూ అనిపించ లేదు. ఆయనను పెళ్లి చేసుకున్న తరువాత నా ప్రపంచం అంతా ఆయన, ఆయన చిత్రాలే. అన్న ప్రాసన నాడు పాప కుంచె పట్టుకున్నపుడు, ఆయన పడ్డ ఆనందం నాలో ఓ బలమైన ముద్ర వేసింది.

'తన  కళ తనతో పాటు నశించి పోకూడదు తన కూతురికి అది అందచేయాలనే' భావన నాలో నాటుకుంది. ఆ లక్ష్యం మీదే నా దృష్టంతా. అందుకే పాపను చిత్ర కళ వైపు ప్రోత్సహించాను " అది చెప్పేది వింటూ, అర్థం చేసుకోవటానికి  ప్రయత్నిస్తున్నాను.

"భావిక చిత్ర కళను అందిపుచ్చుకుంది. అది 'దైవికమా, నా సంకల్ప బలమా...లేదా జీన్సా'  అన్నది నా ఊహకు అందనిది. భావిక ఉత్తమ కళాకారిణిగా ఎదుగుతోంది. ఇంకొన్ని మెట్లు ఎక్కాల్సి ఉంది. ఆ రోజు కోసం వెయ్యి కన్నులతో ఎదురు చూస్తున్నాను " ఆనందంగా చెప్పింది . అర్థం కానట్లు చూశాను.

"ఆయనకు తన కూతురిని ఓ అద్భుతమైన చిత్రకారిణిగా , అపురూపమైన కానుకగా అందచేయాలని నా కోరిక.  ఆ గోల్ సాధిస్తాననే నమ్మకం నాకు ఉంది" అంది హాయిగా నవ్వుతూ.

పిల్లలపై ఎన్నో ఆశలు, కలలు పెట్టుకున్న వాళ్ళు , ఎంత వరకు వాటిని సాధించారో తెలియదు.

కానీ 'తొందర పడింది..ఓడిపోయింది' అన్న ముద్ర వేయపడి, ఇలా తమ లక్ష్యాలను సాధించిన వసంత లాంటి వాళ్ళు మటుకు తక్కువే ! గాఢంగా వసంత ను ఆలింగనం చేసుకున్నాను.

★★★

COMMENTS